క్లుప్తంగా

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, సంతోషిమాత హవనం, కనకాభిషేకం, సువాసిని సహిత సామూహిక కుంకుమార్చన, మహార్నివేదన, పల్లకీసేవ, భజనలు, భక్తిగేయాలతో వేడుకలు ముగించారు. భాగంగా భక్తులకు తీర్థప్రసాదం అందించి అన్నదానం చేశారు.

మట్టి రోడ్డు పనులకు భూమిపూజ



చిన్నచింతకుంట: మండలంలోని మహమ్మద్ గాజుల గఫూర్ పొలం నుంచి జిన్నారం చిన్నయ్య పొలం వరకు మట్టిరోడ్డు వేసేందుకు అధికారులు రైతులతో కలిసి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పొలాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలకు మట్టిరోడ్డు ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు గంజి బాల్‌రాజు, కే గుండన్న, జి.పి లోగు, ఎల్ఎం రాజు, ఎస్ శేఖర్, జి.వై ప్రతాప్, ఎండీ గౌస్, జయరాజ్, మలాగర్, శాంసన్, విజయ్, మహేష్ పలువురు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మజీదుల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు షబే బరాత్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈషా నమాజ్ అనంతరం ప్రత్యేక దువాచేశారు. మతపెద్దలు ధార్మిక ప్రసంగాలు చేశారు. స్థానిక న్యూప్రేమ్‌నగర్‌లోని అన్వారే మదీనా మజీద్‌లో మౌలానా రహెమతుల్లా ధార్మిక ప్రసంగం చేశారు. చిన్నారులు నాతేషరీఫ్‌లను ఆలపించారు. ఎదిర రెవెన్యూవార్డులోని జామే మజీద్‌లో నిర్వహించిన షబే బరాత్ వేడుకల్లో మౌలానా హాఫిజ్ మహ్మద్ ఇమ్రాన్ నక్షబంది ధార్మిక సందేశం ఇచ్చారు. అల్లా చివరిదూత మహ్మద్ ప్రవక్త (స.అస) మార్గం అనుసరణీయమని అన్నారు. ప్రవక్త సున్నత్‌లను విధిగా పాటించాలని కోరారు. ఇలాంటి జాగరణ రాత్రుల్లో దువా చేయడంతోపాటు దైవ ప్రార్థనలు చేయాలని సూచించారు. నాతేషరీఫ్‌లను ఆలపించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ హకీం, అజీజుల్లా, మౌలానా హాఫిజ్ ఫేరోజ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించిన అనంతరం పలువురు మహిళలు మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రపారాయణం నిర్వహించారు. అమ్మవారి పల్లకీసేవను నిర్వహించి భక్తులకు అల్పాహారం అందించారు.

యువతి అదృశ్యం


సుశ్మిత

నవాబుపేట: మండలంలోని కారుకొండకి చెందిన యువతి అదృశ్యం కావటంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. కారుకొండకు చెందిన కృష్ణారెడ్డి కుమార్తె సుశ్మిత ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవటంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి
- పుల్వామా అమరువీరులకు ఘన నివాళి


మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మాజీ సైనికులు

సాక్షి నెట్‌వర్క్: అమరుల త్యాగాలు మరువ లేనివని మాజీ సైనికుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో జమ్ము కశ్మీర్‌లోని పుల్వామా ఘటనలో అమరులైన సైనికుల ఆత్మశాంతి కోసం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయరని అన్నారు. సైనికుల త్యాగులను ఎప్పటికీ మరిచిపోమన్నారు సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, నాయకులు బాలేశ్వర్‌రెడ్డి, భీమయ్య, లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శివరాజు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పుల్వామా అమరువీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్, నాయకులు శివప్రసాద్, శివరాం, ప్రదీప్, శ్రావణి, సరస్వతి, సాయిరాం,విద్యార్థులు పాల్గొన్నారు.
- దేవరకద్ర మండలం పెద్దరాజమూర్‌లో పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.
- కోయిల్‌కొండ మండలంలోని పారుపల్లి శ్వేతావిద్యామందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈసందర్భంగా దేశం కోసం చేసిన సేవలను పాఠశాల కరస్పాండెంట్ నరేందర్‌జీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వీరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- కొకుంట్ల మండలం అప్పంపల్లిలో వీర జవాన్ తిమ్మప్ప స్థూపం వద్ద ఆర్మీ జవాన్లు వెంకట్‌రాజ రెడ్డి, శ్రీకాంత్, మాజీ సైనికుడు రాధకృష్ణారెడ్డి గ్రామస్తులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. గ్రామస్తులు అశోక్ రెడ్డి, సత్యశీలారెడ్డి, శివరాజు, మురలీమోహన్‌రెడ్డి, వంశీ, భాస్కర్‌రెడ్డి, అంజన్న తదితరులు ఉన్నారు.
- నవాబుపేట మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు చిగుళ్ళపల్లి నర్సింహులు, అనంతయ్య, చౌదరి వెంకటేశ్వరప్ప, వేణునాథం, రామ్మోహన్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాజు, శివ, ఆనంద్, భాను, వెంకట్, శివ, సంతోష్, రఘు, మల్లేష్, నర్సింహ, మణివర్మ, మణికంఠ పాల్గొన్నారు.
- జడ్చర్లలోని నేతాజీచౌరస్తాలో పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, ఫేలివాక్ అసోసియేషన్, వివిధ సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.


దేవరకద్ర మండలం పెద్దరాజమూర్‌లో అమర జవాన్లకు నివాళి


కోయిల్‌కొండ మండలం పారుపల్లిలో అమరవీరుల చిత్రపటానికి నివాళి


కొకుంట్ల మండలం అప్పంపల్లిలో అమరజవాన్ తిమ్మప్ప స్థూపం వద్ద నివాళి

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మాపూర్, కోడూర్ గ్రామాల్లో గల జెడ్పీహెచ్ఎస్‌లో చదివే పదో తరగతి విద్యార్థులకు తన సొంత నిధులతో డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమై మంచిగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించా లని సూచించారు. ఈ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను కేవలం మహబూబ్‌నగర్ విద్యార్థులకు మాత్రమే అందిస్తున్నామని తెలిపారు. ధర్మా పూర్ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు 15రోజుల్లో నూతన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ము డా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ బాలుయాదవ్, జీహెచ్ఎంలు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యాలయాలు అభివృద్ధి చెందినప్పుడే..

విద్యాలయాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వికలాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ ద్వారా రూ.69లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, గ్రంథాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ పాఠశాలలో చదివి ఈ రోజు స్థిరపడిన హరీష్ నాకు పాత మిత్రుడు అని, హరీష్‌తో పాటు ఈ పాఠశాలలో చదివి జీవితంలో స్థిర పడ్డ వారి మాదిరిగానే మీరు మంచిగా చదువుకొని మీరు కూడా జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. అంధుల ఆశ్రమ పాఠశాలలో చదివి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ శాఖలలో ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడిన పూర్వపు విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించారు. ప్రిన్సిపాల్ రాములు, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, రాములుయాదవ్, రమేష్‌యాదవ్, రఘురాంరెడ్డి, తిరుమల వెంకటేష్, పాపారాయుడు, కాటంరాజు, డా.చిక్కాహరీష్ పాల్గొన్నారు.

ప్రతి మారుమూల గ్రామానికి తారురోడ్డు

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


నవాబుపేటలో ఇందిరమ్మ మాడల్‌హౌస్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: నియోజకవర్గంలో ప్రతి తండాకు, మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దేపల్లిగ్రామానికి గల మట్టి రోడ్డును బీటీగా మారుస్తూ రూ.4.20 లక్షలతో మంజూరైన పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం గతంలో నుంచి ప్రజాసేవలోనే తరిస్తుందని నిరంతరం వారిసేవకే అంకితమన్నారు. ఇప్పటికే మండలంలో గ్రామాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్లతో పాటు బీటీరోడ్లకు దాదాపుగా రూ.100కోట్లు కేటాయించి పనులు చేస్తున్నట్లు వివరించారు.

ఇందిరమ్మ మాడల్ హౌస్‌కు శంకుస్థాపన

కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మాడల్ హౌస్‌కు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అందించే రూ.5లక్షలతో మాడల్‌గా నిర్మాణం చేసి ప్రజలకు అవగాహన కల్పించేలా భవన నిర్మాణం చేస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసిరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, ఆంజనేయులు, రాజేష్, రఘువీర్‌శర్మ, సీల్యానాయక్, అమరేష్, రమేష్‌గౌడ్, వెంకటయ్య, కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి గిరిజన తండాకు బీటీరోడ్డు వేస్తాం

రాజాపూర్: జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి గిరిజనతండాకు బీటీరోడ్డు వేస్తామని ఎమ్మెల్యే అనిరుద్రెడ్డి అన్నారు. మండలంలోని మైసమ్మకుంటతండా నుంచి కేశ్యానాయక్‌తండాకు రూ.90 లక్షల నిధులతో వేస్తున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి, తిర్మలగిరి గంగాపూర్ రోడ్డు పనులు చకచకా సాగుతున్నాయని అన్నారు. రంగారెడ్డిగూడ నుంచి కల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి మీదుగా రోడ్డుపనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. నర్సింగ్‌తండా నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. శ్రీనివాస్‌నాయక్, నరహరి, కృష్ణయ్య, యాదయ్య, కిషన్, విక్రంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణస్వామి శకటోత్సవం


ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లతో ఊరేగింపు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడగ్రామంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం పంచరాత్ర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుందరంగా అలంకరించిన ఎద్దుల బండ్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ధర్మకర్త జనంపల్లి దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. చుట్టుపక్కలగ్రామాల భక్తులు అధిక సంఖ్యంలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. గ్రామస్తులు శివప్రసాద్, లక్ష్మీనారాయణగౌడ్, ఆంజనేయులు, యాదయ్య పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ జయంతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని అయ్యప్ప కొండపై ఉన్న మహారాజ్ దేవాలయంలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ మహరాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామచంద్రనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహాభోగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ హాజరు అవుతారని, బంజారులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నవాబుపేట: మండల కేంద్రంలో శనివారం సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవకమిటీ అధ్యక్షుడు సీల్యానాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి గిరిజనుల నృత్యాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు ప్రముఖులు పాల్గొంటున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో గిరిజన నాయకులు మార్కెట్ వైస్‌చైర్మన్ తులసిరాంనాయక్, చందర్‌నాయక్, శంకర్‌నాయక్, గోపాల్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే జీతాల బడ్జెట్ విడుదల

జడ్చర్ల టౌన్: ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికుల జీతాలకు సంబంధించిన బడ్జెట్ విడుదలైందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ శుక్రవారం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది రోజులుగా విధులు నిర్వహిస్తూనే ఆస్పత్రుల్లో కార్మికులు నిరసనలు వ్యక్తం చేశారన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే పెండింగ్‌లో ఉన్న 7నెలల జీతాలకు సంబంధించిన బడ్జెట్‌ను ఏజన్సీలకు విడుదల చేసినట్లు తెలిపారు. బడ్జెట్ విడుదల అయ్యేందుకు చొరవ చూపిన వైద్య విధానపరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బీసీలకు రూ.50వేల కోట్లు కేటాయించాలి


కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ జాగృతి సేన నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో బీసీలకు జనాభా దామాషా నిష్పత్తిన బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించాలని బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బీసీ జాగృతిసేన ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉప ప్రణాళిక ఏర్పాటుచేసి ప్రతి వార్షిక బడ్జెట్‌లో అదనంగా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ప్రభుత్వం పేర్కొందని అన్నారు. కానీ గతేడాది రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించకుండా విస్మరించిందని, ఈసారైనా రూ.40వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్‌చేశారు. బీసీ జాగృతిసేన కార్మిక విభాగం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, నర్సిములు, వెంకటేష్ ఉన్నారు.

మహిళలకు భద్రత పెరగాలి

- జిల్లాన్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర


వసతులపై ఆరాతీస్తున్న న్యాయమూర్తి

పాలమూరు: జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డలో ఉన్న చిల్డ్రన్ హోం, స్టేట్ హోం, శిశుగృహాలను శుక్రవారం జిల్లాన్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర పరిశీలించారు. స్థానికంగా అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయా, పిల్లలకు సకాలంలో వైద్యసేవలు, నాణ్యతతో కూడిన ఆహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు లైంగికవేధింపులపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పని చేసే ప్రాంతాల్లో భద్రత పెరగాలన్నారు. ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైతే దానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఉద్యోగులు చేసే ప్రాంతాల్లో ఏమైనా ఇబ్బందులువస్తే న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కూరగాయలు రైతుబజార్‌లో అమ్మేందుకు చర్యలు

- మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి
- కూరగాయల వ్యాపారులతో వాగ్వాదం



రైతుబజార్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, నాయకులు

జడ్చర్ల టౌన్: మార్కెట్‌యార్డు రోడ్డు పొడుగునా సాగుతున్న కూరగాయల విక్రయాలను రైతుబజార్‌లోకి తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు నిర్ణయించారు. శుక్రవారం కమిషనర్ ఆధ్వర్యంలో వారు కూరగాయలు విక్రయిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ముఖ్యంగా యార్డులోకి వెళ్లే రోడ్డులో భీమయ్యడబ్బా నుంచి కూరగాయలు విక్రయిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయని కొందరు మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారం కోసం పరిశీలించాలని కమిషనర్‌ను ఆదేశించారు. యార్డు ప్రహరీ వెంట కూరగాయల విక్రయాలు చేయటంతో సమస్యలు ఎదురవుతున్నాయని, రైతుబజార్‌లోకి తరలించేలా చర్యలు తీసుకుంటామని కూరగాయల వ్యాపారులకు కమిషనర్ వివరించారు. అయితే ఈ సందర్భంగా కూరగాయల విక్రయదారులతో వాగ్వాదం జరిగింది. అనంతరం రైతుబజార్‌ను సందర్శించారు. రైతబుజార్‌లో కొన్నిమార్పులు, చేర్పులు చేసి విక్రయాలకు అనుకూలంగా మార్చాలని నిర్ణయించారు. కౌన్సిలర్లు రఘురాంగౌడ్, కుమ్మరి రాజు, నాయకులు అల్వాల్‌రెడ్డి, నిత్యానందం, బుక్కవెంకటేశం, కోనేటి నర్సింహులు ఉన్నారు. ఇదే ప్రాంతంలో వ్యాపారులు రోడ్డుమీద నిర్మాణాలు చేశారన్న ఆరోపణలు సైతం రావటంతో ఇదివరకే కొందరికీ నోటీసులు జారీ చేయగా నలుగురు మాత్రమే డాక్యుమెంట్లు సమర్పించారని, మిగిలిన వారికి మరోమారు నోటీసులు జారీచేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్లు పరిశీలించారు. కార్యాలయ భవనం త్వరగా నిర్మాణం చేసి స్వాధీనపర్చాలని కాంట్రాక్టర్‌కు వారు సూచించారు. మూడు నెలల్లో పనులు పూర్తిచేసి భవనాన్ని స్వాధీనపరుస్తానని కాంట్రాక్టర్ వారికి వివరించారు. కౌన్సిలర్లు రఘురాంగౌడ్, కుమ్మరిరాజు, చైతన్య చౌహాన్, నాయకులు నిత్యానందం, బుక్కవెంకటేశం, కృష్ణారెడ్డి, కోనేటి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలంటూ బ్యాంక్ ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఉద్యోగులు బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని వివిధ ఎస్‌బీఐ బ్రాంచీల ఉద్యోగులు రాజేంద్రనగర్‌లోని ఎస్‌బీఐ వద్ద శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ అవార్డు స్టాఫ్ యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రీజినల్ కార్యదర్శి నరేష్‌కుమార్, ఆఫీసర్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి మాట్లాడారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న అన్నిస్థాయిల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల పిలుపుమేరకు వచ్చేనెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగుల సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు..

సమస్యల పరిష్కారం కోసం అన్నిబ్యాంక్‌ల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సభ్యులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసనలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘాల కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, అధ్యక్షులు జె.రాజేష్, యూబీఐ బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు అఖిలాష్‌రెడ్డి, శివ నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నాగర్‌కర్నూలు పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ కృషి, అనుభవం కార్యక్రమంలో ఏరువాకకేంద్రం కో ఆర్డినేటర్ డా.భరత్ భూషణ్ ఆదేశాలతో శుభ్రత కార్యక్రమం చేపట్టారు. చీపురుపట్టి పాఠశాల ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. విద్యార్థులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. హరిచందన, మేఘన, రాధిక, ప్రజ్వలిక, చోప్రాదేవి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేటు స్కూళ్లకు అనుమతులిచ్చేందుకు యాజమాన్యాలను ఇబ్బందులకు గురిచేస్తున్న డీఈఓ కార్యాలయం సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం డీఆర్ఓ రవికి పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి డబ్బులివ్వని వారి ఫైల్స్ రోజుల త్వరబడి పెండింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలకు సంబంధించి అనధికార బ్రాంచ్‌ను నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వం రూ.2లక్షలు జరిమానా వేస్తే దాన్ని చెల్లించకుండా సూపరింటెండెంట్ అడ్డుపడ్డారని తెలిపారు. డీఈఓ కార్యాలయంలో మాజీ డీఈఓ ఏసీబీకి చిక్కినా అధికారుల తీరుమారడం లేదన్నారు. గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నాయకులు భరత్, ఎస్ఎఫ్ఐ ప్రశాంత్, డీవైఎఫ్ఐ ఆనంద్, కేవీపీఎస్ ఆదివిష్ణు, బంజారా గిరిజన సమాఖ్య నాయకులు సంతోష్, బీఈడీ సంఘం రమేష్ పాల్గొన్నారు.